


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 31 | మే | 2026 ◆ పేజీలు : 5



# పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 30 ,(ప్రజాజ్యోతి)** జూన్ 5 నుండి 12 వరకు నిర్వహించనున్న పదవ తరగతి అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం ఐ డి ఓ సి కార్యాలయం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో నిర్వహించిన

మిగతా 2 లో...



4 లో..


# పాల్వంచలో ఎక్సైజ్ సీఐ జాడెక్కడ...?

- వరుస కథనాలు వెలువడినా స్పందించని ఎక్సైజ్ శాఖ
- పోలీసుల మౌనం వెనుక మర్మమేంటి..?
- మద్యం సిండికేట్ లో ఎక్సైజ్ సీఐ వాటా ఎంత..?

పాల్వంచ పట్టణంలో మద్యం విక్రయాలపై గత కొన్ని రోజులుగా వరుస కథనాలు వెలువడుతున్నా సంబంధిత అధికారులు ఇప్పటికీ స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పాల్వంచ లో పుష్ప తరహా మద్యం సిండికేట్ పేరుతో పాల్వంచలో నడుస్తున్న మద్యం సిండికేట్ పై స్పష్టమైన ఆధారాలతో కథనాలు ప్రచురితమైనప్పటికీ, ఎక్సైజ్ శాఖ కానీ స్థానిక పోలీసులు కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.

- పాల్వంచ, ప్రజాజ్యోతి

# గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సమగ్ర చర్యలు చేపట్టాలి




- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 30,(ప్రజాజ్యోతి)** 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలు విజయవంతంగా నిర్వహించేందుకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ సమగ్ర చర్యలు చేపట్టాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆదేశించారు.శనివారం హైదరాబాద్ నుండి దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి గోదావరి పరివాహక జిల్లాల కలెక్టర్లతో గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారుఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ, పుష్కరాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికలతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా స్నాన ఘాట్ ల అభివృద్ధి, రహదారి సదుపాయాలు, పార్కింగ్ ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.భక్తులకు ఎలాంటి

మిగతా 2 లో...

# వరద ముప్పు నివారణకు ముందస్తు చర్యలు

- బదిలీపై వెళ్తున్న అధికారులకు ఘన సన్మానం



**ఇల్లందు, మే 30, ప్రజాజ్యోతి:** రానున్న వర్షాకాలంలో పట్టణ ప్రజలకు వరదల వల్ల ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఇల్లందు మున్సిపల్ పాలకవర్గం అధికారులకు సూచించింది. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో

మిగతా 2 లో...



# ఐడిఓసి కార్యాలయంలో మాక్ పార్లమెంట్ నిర్వహణ

- బాలికల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 30,(ప్రజాజ్యోతి)** ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా వారోత్సవాల సందర్భంగా శనివారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కౌమారదశ బాలికలతో మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై బాలికలు నిర్వహించిన మాక్ పార్లమెంట్‌ను పరిశీలించారు. బాల్య వివాహాల నిర్మూలన, మహిళల భద్రత, మహిళా హక్కులు, విద్య ప్రాధాన్యత వంటి అంశాలపై బాలికలు నిర్వహించిన చర్చలను అభినందించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మాక్ పార్లమెంట్ ద్వారా బాలికలకు పార్లమెంటరీ వ్యవస్థ, చట్టసభల పనితీరు, ప్రశ్నోత్తరాల సమయం, బిల్లుల ప్రవేశపెట్టడం, చట్టాల రూపకల్పన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా మహిళా సాధికారత

మిగతా 2 లో...

## వరద ముప్పు నివారణకు ముందస్తు చర్యలు

(మొదటి పేజీ తరువాయి...)

మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్బంగా మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి, ప్రజారోగ్యానికి సంబంధించిన 9 ముఖ్యాంశాలతో కూడిన తీర్మానాలను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందన్నారు. ముఖ్యంగా పట్టణంలోని బుగ్గవాగు పరిసర ప్రాంతాల్లో వరద ముప్పు పొంచి ఉన్న లోతట్టు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కౌన్సిల్ నిర్ణయించిందని, భారీ వర్షాలు కురిసినప్పుడు ప్రజలకు ఇబ్బంది కలగకుండా డ్రైనేజీల పూడికతీత, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై పాలకవర్గం, అధికారులు సుదీర్ఘంగా చర్చించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

### »» బదిలీపై వెళ్తున్న పలువురికి వీడ్కోలు ...

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అనంతరం ఇల్లందు మున్సిపాలిటీలో సుదీర్ఘ కాలం సేవలందించి బదిలీపై వెళ్తున్న మున్సిపల్ మేనేజర్ అంకు షావలి, మున్సిపల్ ఫిట్టర్ ఉట్ల ఈశ్వరయ్య, జవాన్ మాట్ల శ్రీనులను మున్సిపల్ పాలకవర్గం, అధికారులు ఘనంగా సత్కరించారు. విపత్కర పరిస్థితుల్లో వారు అందించిన సేవలను కొనియాడుతూ, శాలువాలు కప్పి జ్ఞాపికలతో సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. అదేవిదంగా మున్సిపల్ కమిషనర్ చింతా శ్రీకాంత్ ఆధ్వర్యంలో బదిలీపై వెళ్తున్న మేనేజర్ అంకుషావళి, సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు, కౌన్సిలర్లు సైదు మియా, అజ్మీరా వంశీ, చిల్లా విజయభారతి, రాధ కమల్ కోరి, గొపగాని రాజు గౌడ్, రేఖ స్వరూప, గందె పద్మ, మెరుగు కార్తీక్ యాదవ్, రంప రమ్య, దండు సారయ్య, నీరుడు ఉపేంద్ర, సోని భాయి కోరి, ఉల్లింగ విజయలక్ష్మి, మహమ్మద్ జాఫర్, నీలాపు రమేష్, కోర్లపాటి శివ కిరణ్, చెనిగారపు శృతి, కో-ఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి, పర్రె స్వర్ణలత, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్, డిఈ మురళి, ఏఈ నవీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి



(మొదటి పేజీ తరువాయి...)

జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూన్ 5వ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1,399 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారని, వారి కోసం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.పరీక్షల నిర్వహణ కోసం నలుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, మరో నలుగురు డిపార్ట్ మెంటల్ అధికారులు, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, ఫ్యాన్లు, ఓఆర్ ఎస్ ప్యాకెట్లు, మరుగుదొడ్లు, ప్రాథమిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు . విద్యార్థులు పరీక్షలకు ముందురోజే తమ పరీక్షా కేంద్రాలను తెలుసుకోవాలని , పరీక్ష జరిగే రోజు కనీసం గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్ లు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణలో విద్యుత్ సరఫరా, రవాణా, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు, తాగునీటి సదుపాయాల విషయంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పరీక్షలను విజయవంతం చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మి, వైద్యశాఖ ప్రతినిధి డా. టి. ప్రతాప్, విద్యుత్ శాఖ డీఈ పి.ఎస్.వి.ఎస్. నందయ్య, ఇల్లందు మున్సిపాలిటీ ప్రతినిధి డి. శ్రీనివాస్, ఆర్టీసీ ప్రతినిధి కె. మోహన్ రావు, డీపీఓ కార్యాలయ ప్రతినిధి ఎస్. శ్రీనివాస్, పోస్టల్ శాఖ ప్రతినిధి ఎం.డి. అలీం, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ప్రతినిధి ఎం. అశోక్, పోలీసు శాఖ ప్రతినిధి పి.డి. క్రిస్టఫర్, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శంభు ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ (పరీక్షలు) ఎస్. మాధవరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# కనులపండుగగా సాయిబాబా మందిర వార్షికోత్సవం

- జ్ఞాన సాయిబాబాకు లక్ష పుష్పాభిషేకం
- అభిషేకాలు అన్నదానాల్లో భారీగా పాల్గొన్న భక్తులు
- బాబా వారిని గ్రామోత్సవం( పల్లకిసేవ )నిర్వహించిన భక్తులు







**అశ్వారావుపేట, మే 30, ప్రజాజ్యోతి :** నియోజకవర్గ కేంద్రంలో జంగారెడ్డిగూడెం రోడ్డులోని జ్ఞాన సాయి బాబా మందిర 22వ వార్షికోత్సవ వేడుకలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య కనులపండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞాన సాయిబాబా విగ్రహానికి లక్ష పుష్పాలతో ప్రత్యేక పుష్పాభిషేకం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని బాబా ఆశీస్సులు పొందారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. మందిర ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం బాబా వారి గ్రామోత్సవం (పల్లకీ సేవ)ను భక్తులు ఘనంగా నిర్వహించారు. పల్లకీలో బాబా విగ్రహాన్ని అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లగా, భక్తులు భజనలు, సాయినామ స్మరణలతో పాల్గొన్నారు. ఈ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. షిరిడిసాయి సేవాసమితి సభ్యులు, పంబి హరిబాబు, మంగదొడ్డి మురళీకృష్ణ, కేత ధనరాజు, ముళ్ళపూడి సూరిబాబు, విమల శ్రీదేవి, లక్కీరెడ్డి కృష్ణరెడ్డి , కోనేరు మురళీకృష్ణ, పృథ్వి,ఆనంద్, రాజేష్, రమాదేవి, పావని, లక్ష్మి, రజిత, లక్ష్మి ,జ్యోతి,స్వప్న, నవీన్, బమ్మిడి అప్పారావు, శాంతకుమారి,తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సమగ్ర చర్యలు చేపట్టాలి



(మొదటి పేజీ తరువాయి...)

అసౌకర్యం కలగకుండా స్నాన ఘాట్ ల వద్ద అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని సూచించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు తమ పరిధిలో చేపట్టాల్సిన పనుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని పుష్కరాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. అందిన ప్రతిపాదనల మేరకు ప్రాధాన్యత పనులకు అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధించి ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, దేవాదాయ శాఖల ద్వారా చేపట్టనున్న పనులను వివరించారు. ఘాట్ ల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల విస్తరణ, నూతన రహదారుల నిర్మాణం తదితర పనులకు సంబంధించి ఆయా శాఖల ద్వారా ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపినట్లు తెలిపారు. అదనంగా అవసరమైన రహదారులు , ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను కూడా ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు .ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భద్రాచలం దేవస్థానం ఈవో దామోదర్ రావు, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, సీపీఓ సంజీవరావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఐ డి ఓ సి కార్యాలయంలో మాక్ పార్లమెంట్ నిర్వహణ



(మొదటి పేజీ తరువాయి...)

, ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళల పాత్ర, సామాజిక బాధ్యతలు, నాయకత్వ లక్షణాల అభివృద్ధి వంటి అంశాలపై చర్చలు నిర్వహించారు. బాల్య వివాహాల నిర్మూలన, మహిళల భద్రత, మహిళా హక్కులు, సమాజ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం వంటి కీలక అంశాలను మాక్ పార్లమెంట్ లో ప్రస్తావించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, బాలికల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, నిర్ణయ సామర్థ్యం, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ, చట్టసభల పనితీరు, చట్టాల రూపకల్పన ప్రక్రియ, ప్రజాప్రతినిధుల బాధ్యతలు, పౌరుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించడమే మాక్ పార్లమెంట్ నిర్వహణ ప్రధాన ఉద్దేశమని అన్నారు, జిల్లావ్యాప్తంగా 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల కౌమారదశ బాలికల కోసం ప్రత్యేకంగా 529 స్నేహ గ్రూపులు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజాస్వామ్యం అనేది ప్రజల భాగస్వామ్యంతో నడిచే గొప్ప వ్యవస్థ అని, దాని గురించి ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.అనంతరం బాలికలు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజుతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాలు, సమాజంలో ఎదురవుతున్న వివిధ సమస్యలపై బాలికలు ప్రశ్నలు అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు,ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన, అడిషనల్ డి ఆర్ డి ఓ బి.నీలేష్,జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సోయం సుజాత , జడ్పీ సీఈఓ, డీఈఓ నాగలక్ష్మి, సీపీఓ సంజీవరావు, డీడబ్ల్యూఓ స్వర్ణ లెనినా , డీపీఎంలు, ఏపీఎంలు, కిషోర బాలికల సంఘాల సభ్యులు, ఇతర సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై మంత్రితో సమీక్ష

- చర్లకు ప్రత్యేక నిధుల ప్రతిపాదన
- అభివృద్ధికై మంత్రిని కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



**చర్ల, మే 30 :(ప్రజాజ్యోతి):** ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకాటి శ్రీహరితో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శనివారం సమావేశమై చర్ల మండల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా చర్ల మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు మౌలిక సదుపాయాల కల్పన ప్రత్యేక నిధుల కేటాయింపు తదితర అంశాలను మండల నాయకులతో కలిసి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా చర్ల అభివృద్ధికి అవసరమైన ప్రత్యేక నిధులు మంజూరు చేయడంతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఇన్‌చార్జి మంత్రి వాకాటి శ్రీహరి భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రత్యేక నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే చర్లలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు త్వరలో పంపించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. చర్ల మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి పేర్కొన్నట్లు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తెలిపారు.ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులు చీమలమరి మురళీకృష్ణ, పోలిన లంకరాజు, పొట్రూ బ్రహ్మానందరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ మేనేజర్ అంకుషావలి బదిలీ





**ఇల్లందు, మే 30, ప్రజాజ్యోతి:** ఇల్లందు మున్సిపల్ మేనేజర్ గా సుదీర్ఘకాలం సేవలందించిన అంకుషావలి బదిలీ అయ్యారు. ఉన్నతాధికారులు ఆయనను మహబూబాబాద్ మున్సిపాలిటీకి బదిలీ చేశారు. ఇల్లందు మున్సిపాలిటీలో మొదట మేనేజర్ గా విధులు నిర్వహించిన అంకుషావలి కొన్ని నెలలు ఇంచార్జ్ కమిషనర్ గా కొనసాగాడు. మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ గా, మేనేజర్ గా అంకుషావలి తనదే నా ముద్దుల వేసుకున్నాడు. బదిలీపై వెళ్తున్న మున్సిపల్ మేనేజర్, పలువురు సిబ్బందిని శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు, కమిషనర్ చింతా శ్రీకాంత్ లు వేర్వేరుగా శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## వద్దిరాజు చొరవతో బోర్ల ఏర్పాటు



**చర్ల, మే 30: (ప్రజాజ్యోతి):** బీఆర్ఎస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన ఎంపీ నిధుల నుంచి మంజూరు చేసిన సుమారు రూ.12 లక్షలతో చర్ల మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేస్తున్న 8 బోర్లలో 7 బోర్లను శుక్రవారం మూడు పంచాయితీలలో ప్రారంభించగా శనివారం నాలుగు పంచాయితీలలో పూజారిగూడెం ప్రాంతంలో గ్రామ మహిళలతో కొబ్బరికాయ కొట్టించి బోరు పనులను ప్రారంభించారు. అనంతరం లింగాపురంపాడు పంచాయతీలో అంజనేయస్వామి ఆలయం వద్ద గ్రామ పెద్దలతో కలిసి బోరు ప్రారంభించారు. కేశవపురం పంచాయతీ పరిధిలోని రాళ్లగూడెంలో అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో మాజీ సర్పంచ్ కోరం నాగేంద్ర కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. కలివేరు పంచాయతీలో సర్పంచ్ లక్ష్మీనారాయణతో కలిసి బోరు ప్రారంభించారు.వేసిన ప్రతి బోరులో నీరు పడటంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.మొదటి విడతలో మొత్తం 8 బోర్లను మంజూరు చేయగా ఇప్పటివరకు 7 బోర్ల పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. తీవ్ర ఎండాకాలంలో గ్రామాలకు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సహకరించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు మాట్లాడుతూ మండలంలోని మరికొన్ని గ్రామ పంచాయతీలలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నందున రెండో విడతలో అదనపు బోర్ల మంజూరుకు ఎంపీకి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. అడిగిన వెంటనే చర్ల మండలానికి 8 బోర్లు మంజూరు చేసిన ఎంపీ రవిచంద్రకు బీఆర్ఎస్ మండల కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కాకి అనిల్, తడికల బుల్లెబ్బాయి, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ చేతిపంపుకు మోటార్

- సర్పంచ్ చొరవతో తొలగింపు



**చర్ల, మే 30:(ప్రజాజ్యోతి):** చర్ల మండలం ఉప్పరిగూడెం గ్రామంలో ప్రభుత్వ చేతి పంపుకు అమర్చిన మోటారును గ్రామ పంచాయతీ అధికారులు శనివారం తొలగించారు. గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని సర్పంచ్ నాగలక్ష్మి చొరవతో ఈ చర్యలు చేపట్టినట్లు పంచాయతీ వర్గాలు తెలిపాయి. ఉప్పరగూడెం పంచాయతీ పరిధిలోని మల్లారం గ్రామానికి చెందిన కొర్స శివ అనే వ్యక్తి ప్రభుత్వానికి చెందిన చేతి పంపుకు ఎలాంటి అనుమతులు లేకుండా మోటారును అమర్చి తన ఇంటి నిర్మాణ పనులతో పాటు వ్యక్తిగత అవసరాల కోసం నీటిని వినియోగిస్తున్నాడని గ్రామస్థులు ఆరోపించగా దీంతో ఆ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు త్రాగునీరు సక్రమంగా అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవటంతో వారు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ అంశంపై గత కొంతకాలంగా గ్రామస్థులు పంచాయతీకి ఫిర్యాదులు చేస్తున్న నేపథ్యంలో పంచాయతీ సిబ్బంది పలుమార్లు సంబంధిత వ్యక్తిని కలిసి మోటారును స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు. ప్రభుత్వ త్రాగునీటి వనరులను వ్యక్తిగత అవసరాలకు వినియోగించడం నిబంధనలకు విరుద్ధమని వివరించినప్పటికీ ఆయన స్పందించలేదని అధికారులు తెలిపారు. అనంతరం ఉప్పరిగూడెం సర్పంచ్ నాగలక్ష్మి అధికారికంగా నోటీసు జారీ చేసి మోటారును వెంటనే తొలగించాలని ఆదేశించారు. అయినప్పటికీ నోటీసును కూడా పట్టించుకోకుండా యథావిధిగా నీటిని వినియోగిస్తున్న క్రమంలో ప్రజలకు త్రాగునీటి కొరత ఏర్పడకుండా పంచాయతీ తరపున ట్యాంకర్ ద్వారా తాత్కాలికంగా నీటి సరఫరా నిర్వహించినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం అవసరమని భావించి అధికారులు చర్యలకు దిగారు. సర్పంచ్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది మల్లారం గ్రామానికి చేరుకుని ప్రభుత్వ చేతి పంపును పరిశీలించి అమర్చిన మోటారును తొలగించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించిన సర్పంచ్ నాగలక్ష్మి, ఉపసర్పంచ్ పంచాయతీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను కొందరు వ్యక్తులు స్వప్రయోజనాల కోసం వినియోగించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మోటారు తొలగింపుతో చేతి పంపు మళ్లీ ప్రజల వినియోగానికి అందుబాటులోకి రావడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సోయం మంగతాయాలు, వార్డు సభ్యురాలు పాయల ప్రమీల, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు గ్రామస్థులు పాల్గొన్నారు.

## లక్కినేని గోపినాధ్ ఐదో వర్ధంతి సందర్భంగా పట్టెడన్నం కార్యక్రమం

- నిరుపేదలకు అన్నదానం చేసి గోపినాధ్ సేవాస్ఫూర్తిని స్మరించిన న్యాయవాదులు










**కొత్తగూడెం, మే 30 ( ప్రజా జ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో లక్కినేని సత్యనారాయణ కుమారుడు ప్రముఖ హైకోర్టు న్యాయవాది లక్కినేని గోపినాధ్ ఐదో వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం పట్టెడన్నం కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం సూపర్ బజార్, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో నిరుపేదలు, నిరాశ్రయులు, ప్రయాణికులకు భోజనం పంపిణి చేశారు. ఈ సందర్భంగా పట్టేడన్నం కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ లక్కినేని సత్యనారాయణ కుమారుడు లక్కినేని గోపినాధ్ న్యాయవాద వృత్తిలో విశేష ప్రతిభ కనబరిచి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారని తెలిపారు. న్యాయం కోసం అంకితభావంతో పనిచేసిన గోపినాధ్ తన వృత్తి జీవితంలో అనేక మందికి అండగా నిలిచారని గుర్తు చేశారు. ఆయన భౌతికంగా దూరమైనప్పటికీ సేవా తత్వం, మానవతా దృక్పథం సమాజంలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. గోపినాధ్ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన పట్టెడన్నం కార్యక్రమంలో పలువురికి భోజనాలు పంపిణీ చేశామన్నారు. గోపినాధ్ జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయన ఆశయాలను కొనసాగిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. వర్ధంతి సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమం పలువురికి ఆహారాన్ని అందించడమే కాకుండా మానవత్వం, సేవాభావానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మారపాక రమేష్, నర్సయ్య, మధు, మరియు చదలవాడ సూరి, శనగ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టిగా బాల్య వివాహాలు నిర్మూలిద్దాం

- మహిళలు సంఘాల్లో చేరి ఆర్థికాభివృద్ధి సాధించాలి : సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి






**ములకలపల్లి మే 30, ప్రజాజ్యోతి:** బాల్య వివాహాలు నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి పిలుపునిచ్చారు. మండలంలోని మూకమామిడి గ్రామపంచాయతీ పరిధి మొగరాల గుప్ప గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మహిళా సంఘాల సభ్యులతో కలిసి గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, స్వయం సహాయక సంఘాల్లో చేరని మహిళలను సంఘాల్లో చేర్చాలని సూచించారు. కిషోర బాలికలతో ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేసి సామాజిక, ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించాలని, బాల్య వివాహాలను అరికట్టాలని పిలుపునిచ్చారు. బ్యాంకుల నుంచి లింకేజీ రుణాలు తీసుకుని వడ్డీ రాయితీ పథకాలను వినియోగించుకోవాలని తెలిపారు. మహిళలు సంఘాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించి కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు. చెట్ల పెంపకం, ప్రకృతి వ్యవసాయం, వెదురు సాగు, పెరటి కోళ్ల పెంపకం, గొర్రెల పెంపకం, భూసార పరిరక్షణ, వయోజన విద్యపై మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు ప్లకార్డులతో గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ మహిళా సాధికారతపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీసీ కే వెంకటేశ్వర్లు, వెదురు కన్సల్టెంట్ నిహారిక, వార్డు సభ్యుడు కీసరి రాజ్‌కుమార్, వివో అధ్యక్షురాలు కీసరి సుజాత,<పొదుపు సంఘాల మహిళలు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు

## ఘనంగా సీఐటీయూ 56 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలు అవసరం : సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు



**ములకలపల్లి, మే 30 ప్రజాజ్యోతి:** కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు పిలుపునిచ్చారు. సీఐటీయూ 56వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని సీఐటీయూ గద్దె వద్ద తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిక్కుల శ్రీను జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిమ్మల మధు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు కార్మిక హక్కులను హరిస్తున్నాయని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డులో సౌకర్యాలు పెంచాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వర్క రుక్మధరావు, ఓరుగంటి శ్రీను, మేకల రమేష్, ఎనిగండ్ల రంగారావు, కృష్ణ, పసుపులేటి వెంకటేశ్వర్లు, బిబినేని వెంకన్న, చంద్రం, నల్లి నాగరాజు, పసుపులేటి లక్ష్మీపతి, సాయి, రమేష్, లక్ష్మి, నారాయణ పాల్గొన్నారు.



# పాల్వంచలో ఎక్సైజ్ సీఐ జాడెక్కడ...?

- వరుస కథనాలు వెలువడినా స్పందించని ఎక్సైజ్ శాఖ
- పోలీసుల మౌనం వెనుక మర్మ మేంటి..?
- మద్యం సిండికేట్ లో ఎక్సైజ్ సీఐ వాటా ఎంత..?

**పాల్వంచ పట్టణంలో మద్యం విక్రయాలపై గత కొన్ని రోజులుగా వరుస కథనాలు వెలువడుతున్నా, సంబంధిత అధికారులు ఇప్పటికీ స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పాల్వంచ లో పుష్ప తరహా మద్యం సిండికేట్ పేరుతో పాల్వంచలో నడుస్తున్న మద్యం సిండికేట్ పై స్పష్టమైన ఆధారాలతో కథనాలు ప్రచురితమైనప్పటికీ, ఎక్సైజ్ శాఖ కానీ స్థానిక పోలీసులు కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.**

- పాల్వంచ, ప్రజాజ్యోతి

పట్టణంలో బెల్ట్ షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నా, ఎమ్మార్పీకి మించి ధరలు వసూలు చేస్తున్నా, అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు జరుగుతున్నా పర్యవేక్షించాల్సిన ఎక్సైజ్ అధికారులు కనిపించకపోవడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమవుతోంది.

### ››› పాల్వంచ లో ఎక్సైజ్ సీఐ ఉన్నట్టా, లేనట్టా..?

ముఖ్యంగా పాల్వంచలో ఎక్సైజ్ సీఐ ఉన్నారా..? ఉంటే ఎక్కడున్నారు..? అనే ప్రశ్నలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పట్టణంలో బహిరంగంగా జరుగుతున్న ఈ అక్రమాలపై ఇప్పటికీ స్పందించకపోవడం వెనుక ఎవరి అండ ఉంది..? ఎవరిని కాపాడేందుకే ఈ మౌనం..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ››› పాల్వంచలో ఎక్సైజ్ సీఐ విధులు ఎక్కడ..?

పట్టణంలో మద్యం విక్రయాలపై నిఘా పెట్టాల్సిన ఎక్సైజ్ సీఐ కార్యాలయానికే పరిమితమయ్యారా..? లేక ఫీల్డ్ లో పర్యవేక్షణ పూర్తిగా మరిచిపోయారా..? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అక్రమ మద్యం విక్రయాలు రోజురోజుకు పెరుగుతున్నా, బెల్ట్ షాపులు నిర్భయంగా కొనసాగుతున్నా ఎక్సైజ్ శాఖ నుంచి ఒక్క హెచ్చరిక కూడా లేకపోవడం ప్రజల్లో అనుమానాలు పెంచుతోంది.

### ››› ఫిర్యాదులు ఉన్నా చర్యలు ఎందుకు లేవు..?

పాల్వంచలో మద్యం అక్రమాలపై ఇప్పటికే ఎన్నోసార్లు ఫిర్యాదులు వెళ్లినా, పత్రికల్లో వరుస కథనాలు వచ్చినా ఎక్సైజ్ సీఐ నుంచి ఎలాంటి స్పందన కనిపించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. మరి కొందరు పలు మార్లు పిర్యాదు వేయడానికి పాల్వంచ ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి వెళ్ళగా ఒక్క సారి కూడా ఎక్సైజ్ సీఐ కార్యాలయం లో లేరు అని ఆరోపిస్తున్నారు. దీని పై కారణాలేంటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

### ››› సిండికెట్ కు అండ ఎవరిది..?

పాల్వంచలో కొందరి చేతుల్లో మద్యం వ్యాపారం కేంద్రీకృతమైందన్న ఆరోపణలు వస్తున్న వేళ, సంబంధిత అధికారుల మౌనం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. ఎక్సైజ్ సీఐకు ఈ వ్యవహారంపై పూర్తి సమాచారం లేదా..? సమాచారం ఉన్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు..? అనే ప్రశ్నలు స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి.

### ››› జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలి

పాల్వంచలో మద్యం సిండికేట్ పై వస్తున్న ఆరోపణలు, ఎక్సైజ్ శాఖ వ్యవహరిస్తున్న తీరుపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. ఎక్సైజ్ సీఐ పనితీరుపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పట్టణం మొత్తం మాట్లాడుకుంటుంటే ఎక్సైజ్ సీఐ మాత్రం ఎందుకు మౌనంగా ఉన్నారు..?" అని ప్రజలు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు.

మద్యం సిండికేట్ పై వరుస కథనాలు వచ్చినా ఎక్సైజ్ శాఖ స్పందించకపోవడం అధికార యంత్రాంగ పనితీరుపై సందేహాలు రేకెత్తిస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఎక్సైజ్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పాల్వంచలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పట్టణంలో అక్రమాలు బహిరంగంగా కనిపిస్తున్నా... ఎక్సైజ్ సీఐ మాత్రం కనిపించడంలేదు అంటూ స్థానికులు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు.

## గుట్టపై చర్చి రోడ్డుకు విద్యుత్ స్తంభాలు

- హామీ నిలబెట్టుకున్న సర్పంచ్ ప్రేమిందర్ నాయక్

**లక్ష్మీదేవిపల్లి, మే 30 ( ప్రజాజ్యోతి )** మండల పరిధిలోని హమాలీ కాలనీ గ్రామపంచాయతీ గుట్టపై చర్చి రోడ్డులో ఎన్నో సంవత్సరాలుగా విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామ సర్పంచ్ గుగులోత్ ప్రేమిందర్ నాయక్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. గ్రామంలోని గుట్టపై చర్చి రోడ్డులో విద్యుత్ సౌకర్యం లేక రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ తాళ్లపల్లి రాజు, ఆత్మ కమిటీ డైరెక్టర్ శేషాద్రి వినోద్, గ్రామ పెద్దలు మల్లు జ్యోతిబసు, లైన్‌మన్ రాధాకృష్ణ, తోట రమేష్ తదితరులు పనులను పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కార దశకు చేరుకోవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తమ వీధిలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేపట్టిన సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి మరిన్ని చర్యలు చేపట్టాలని కోరారు.



# డా. బానోత్ సంజయ్ నాయక్‌కు ప్రతిష్టాత్మక పురస్కారం

- "డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం" అకడమిక్ ఎక్స లెన్స్ అవార్డుకు ఎంపిక



**టేకులపల్లి, మే 30, ప్రజాజ్యోతి :** మండలంలోని బోడు గ్రామానికి చెందిన డా. బానోతు సంజయ్ నాయక్ ను ప్రతిష్టాత్మకమైన పురస్కారం వరించింది. విద్యా, సాంకేతిక రంగాలలో గత రెండు దశాబ్దాలుగా విశిష్ట సేవలందిస్తూ,నూతన ఆవిష్కరణలతో దూసుకుపోతున్న ప్రముఖ విద్యావేత్త,హైదరాబాద్ వాక్సెన్ విశ్వ విద్యాలయం ఏఐ&ఎమ్ఎల్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్& హెడ్ డాక్టర్ బానోతు సంజయ్ నాయక్ ఎంపికయ్యారు. భారత రత్న, మాజీ రాష్ట్రపతి డా. ఏ.పి.జె.అబ్దుల్ కలాం జ్ఞాపకార్థం అందించే "డా.ఎపిజే అబ్దుల్ కలాం అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డు"ను శనివారం జరిగిన కార్యక్రమంలో, సుప్రసిద్ధ పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగులయ్య చేతుల మీదుగా డా. సంజయ్ నాయక్ ఈ అత్యున్నత అవార్డును అందుకున్నారు. విద్యారంగంలో ఆయన సాధించిన మరో మైలు రాయిగా ఈ పురస్కారం నిలిచింది. గత ఇరవై ఏళ్లుగా పరిశోధన, నాయకత్వ పటిమ, నవీన ఆలోచనలతో విద్యా రంగ ప్రగతికి డా. సంజయ్ నాయక్ అంకితభావంతో కృషి చేస్తున్నారు. టెక్నాలజీ రంగంలో మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)మెషిన్ లెర్నింగ్ (ఎమ్ఎల్) వంటి అత్యాధునిక అంశాలలో విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. గతంలో ఆయన అందించిన అద్భుత సేవలకు గానూ "విద్యా రత్న", "బెస్ట్ ఇంజనీర్", "బెస్ట్ రీసెర్చర్" వంటి పలు ప్రతిష్టాత్మక అవార్డులు వరించాయి. ఈ వరుస విజయాల పరంపరలో కలాం పేరిట వచ్చిన ఈ తాజా అవార్డు ఆయన నిరంతర కృషికి, అంకితభావానికి దక్కిన నిజమైన గుర్తింపుగా విద్యా ప్రముఖులు కొనియాడారు. ఈ సందర్భంగా డా. బానోత్ సంజయ్ నాయక్ మాట్లాడుతూ.. యువతకు మహా స్ఫూర్తి ప్రదాత అయిన డా. అబ్దుల్ కలాం పేరిట ఉన్న ఈ అవార్డును పద్మశ్రీ మొగులయ్య చేతుల మీదుగా అందుకోవడం అత్యంత గర్వకారణంగా, సంతోషంగా ఉందన్నారు. ఈ గౌరవం తన వ్యక్తిగత విజయమే కాకుండా.. విద్య, పరిశోధన, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి పట్ల తనకున్న బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు."విద్య ద్వారా సమాజాన్ని మార్చడమే నిజమైన విజయం" అని నమ్మే తాను, రాబోయే రోజుల్లో సాంకేతిక విజ్ఞానాన్ని సమాజ శ్రేయస్సుకు మరింతగా ఉపయోగపడేలా పరిశోధనలు సాగిస్తానని, ఎందరో విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తూ ముందడుగు వేస్తానని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పలువురువిద్యావేత్తలు, అధికారులు, తోటి అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

## కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమిద్దాం : కే. బ్రహ్మచారి



**కొత్తగూడెం, మే 30 ( ప్రజాజ్యోతి )** కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం అన్ని రంగాల కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కే. బ్రహ్మచారి పిలుపునిచ్చారు. సీఐటీయూ 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం పట్టణంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారం, కనీస వేతనాల అమలు, ఎనిమిది గంటల పని విధానం కోసం సీఐటీయూ నిరంతరం పోరాడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ కృషి ఫలితమే సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ నియామకాలు

- - ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్



**మణుగూరు, మే 30 (ప్రజాజ్యోతి ):** మణుగూరు ఏరియాలో ఖాళీగా ఉన్న సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని పలుమార్లు మేనేజ్మెంట్ తో చర్చలు జరిపి, అనేకమార్లు స్ట్రక్చర్ సమావేశాల్లో మాట్లాడడం జరిగిందని ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 అండర్ గ్రౌండ్ జనరల్ అసిస్టెంట్లను సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ నియామకానికి నియమిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేయడం ఏఐటీయూసీ కృషి ఫలితమే అని అన్నారు. మ్యాన్ పవర్ సరిగా లేకపోవడం వల్ల మిగతా కార్మికులపై పని భారం పెరిగిపోతుందని దీంతో సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ల నియామకానికి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేయడం హర్షనీయమన్నారు. ఆ సర్క్యులర్ ఫలితంగానే 108 అండర్ గ్రౌండ్ జనరల్ అసిస్టెంట్లను సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్లుగా నియమిస్తూ సర్క్యులర్ జారీ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ఏరియాలో పనిచేస్తున్న ఫిట్టర్ మరియు ఎలక్ట్రీషియన్ టెక్నీషియన్లకు సర్ఫేస్ కన్వర్షన్ కొరకు ఏఐటీయూసీ నాయకత్వం కృషి చేసిందని దాని ఫలితంగానే ఫిట్టర్ మరియు ఎలక్ట్రీషియన్ లకు సర్ఫేస్ లో, ఓపెన్ కాస్ట్ మరియు డిపార్ట్మెంట్లలో పోస్టింగ్ ఇప్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. నిరంతరం కార్మికుల సమస్యల పట్ల నిబద్ధతతో నిజాయితీగా పనిచేసే ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ మాత్రమేనని దీనిని కార్మికులు గుర్తుంచుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ ఎం.రామనరసయ్య, ఆఫీస్ బేరర్ ఆవుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రామవరం డిస్పెన్సరీని పునరుద్ధరించాలి : వంగా వెంకట్



**కొత్తగూడెం, మే 30 ( ప్రజాజ్యోతి )** రామవరం సింగరేణి డిస్పెన్సరీ మూసివేత నిర్ణయాన్ని యాజమాన్యం వెంటనే విరమించుకుని ఆస్పత్రిని యథావిధిగా కొనసాగించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కేంద్ర కమిటీ ప్రచార కార్యదర్శి వంగా వెంకట్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రామవరం ప్రాంతంలోని సింగరేణి కార్మికులు, మాజీ కార్మికులు, వారి కుటుంబాలకు డిస్పెన్సరీ ఎంతోకాలంగా వైద్య సేవలు అందిస్తోందని తెలిపారు. వైద్యులు, సిబ్బందిని నియమించకుండా ఆస్పత్రిని మూసివేయడం సరికాదన్నారు. డిస్పెన్సరీ మూసివేత వల్ల స్థానిక కార్మిక కుటుంబాలు చిన్నపాటి వైద్య సేవల కోసం కూడా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం వెంటనే పూర్తిస్థాయి వైద్య సిబ్బందిని నియమించి ఆస్పత్రిని పునరుద్ధరించాలని లేనిపక్షంలో కార్మికుల తరపున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## బదిలిపై వెళుతున్న పంచాయతీరాజ్ ఉద్యోగులకు సన్మానం



**టేకులపల్లి,మే30,ప్రజాజ్యోతి**: టేకులపల్లి మండల పంచాయతి అధికారి జక్కుల గణేష్‌గాంధీ, సూపరిండెంట్ శ్రీనివాస్,పలు పంచాయతి కార్యదర్శులకు శనివారం ఘనంగా వీడ్కోలు పలికిన, అనంతరం ఉద్యోగులకు శాలువాలతో సన్మానించారు.విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించారని ఎంపీవో సేవలు మరువలేనివని కొనియాడారు.బదిలీపై పంచాయతీరాజ్ ఉద్యోగులు ప్రజలకు అనేక సేవలు అందిస్తూ పంచాయతీల అభివృద్ధి కి ఎంతగానో కృషి చేశారని పలు అన్నారు.ఈ కార్యక్రమంలో టేకులపల్లి ప్రజా పరిషత్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించి జిల్లా ఖ్యాతి పెంచాలి.

- -కార్పొరేటర్ కాల్వ భాస్కర్ రావు.



**పాల్వంచ, మే 30, ప్రజాజ్యోతి:** సమ్మర్ కోచింగ్ శిబిరాలను పరిశీలించిన 48వ డివిజన్ కార్పొరేటర్ కాల్వ భాస్కర్ రావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పాల్వంచ శ్రీనివాస కాలనీలోని జిల్లా క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ శిబిరాలను స్థానిక 48వ డివిజన్ కార్పొరేటర్ కాల్వ భాస్కర్ రావు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలను సైతం లెక్కచేయకుండా చిన్నారులకు క్రీడల్లో శిక్షణ అందిస్తూ వారి ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్న క్రీడా శిక్షకుల సేవలు అభినందనీయమన్నారు. క్రీడాకారులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించి అత్యధిక పతకాలు సాధించడం ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖ్యాతిని మరింత పెంచాలని ఆకాంక్షించారు. అనంతరం శిబిరాల్లో శిక్షణ అందిస్తున్న అథ్లెటిక్స్ కోచ్ నాగేంద్ర, ఆర్చరీ కోచ్ కళ్యాణ్, టెన్నిస్ కోచ్ డేనియల్ రాంబాబు, అథ్లెటిక్స్ కోచ్ ఎర్రయ్య పవన్‌లను కార్పొరేటర్ ప్రత్యేకంగా అభినందించారు. స్థానిక ఈవెంట్ మేనేజర్ కె. రమేష్ మాట్లాడుతూ క్రీడాకారుల అభివృద్ధికి తన వంతు సహకారం, ప్రోత్సాహం ఎల్లప్పుడూ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. మహీధర్‌తో పాటు పలువురు క్రీడా ప్రముఖులు, శిక్షకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీంకు ఘన సన్మానం





**ములకలపల్లి, మే 30, ప్రజాజ్యోతి:** జగన్నాథపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన ఇబ్రహీంకు శనివారం గ్రామ సర్పంచ్ కుంజా వినోద్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానం చేశారు. గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. ఇబ్రహీం తన పదవీకాలంలో గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేశారని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలు, ప్రభుత్వ పథకాల అమలులో ఆయన సేవలు ప్రశంసనీయమని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత ఎండి ఉస్మాన్ ఖాన్ ఇబ్రహీం పనితీరును ప్రశంసిస్తూ ఒక కవిత ఆలపించారు. అనంతరం ఇబ్రహీం మాట్లాడుతూ గ్రామ ప్రజల ప్రేమాభిమానాలను ఎప్పటికీ మరిచిపోలేనని, అందరి సహకారంతోనే తాను సేవలు అందించగలిగానని తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ పాలకవర్గం, ప్రముఖ రచయిత ఎండి ఉస్మాన్ ఖాన్, అంగన్ వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొని ఇబ్రహీంకు శాలువాతో సన్మానం చేశారు. స్థానిక సర్పంచ్ పాలక వర్గం తరుపున సన్మానించి చేసి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాధవి, వార్డు సభ్యులు షేక్ షోహెల్, పిడియా వెంకటేశ్వర్లు, సోయం రమాదేవి, బొగ్గం జ్యోతి, మాజీ కో–ఆప్షన్ సభ్యులు షేక్ జబ్బార్, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోయం బోడప్ప, మీడియం నారాయణ, వేముల మురళి, నరుకుళ్ల రంగారావు, రామాచారి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సురభి రాజేష్, గుంటూరు సాయిరాం, కూరం రామకృష్ణ, పామర్తి కృష్ణ, ఐసిడీఎస్ సూపర్వైజర్ ఆర్. నాగమణి, అంగన్ వాడీ టీచర్లు సరస్వతి, తిరుపతమ్మ, పంచాయతీ కార్మికులు మరీదు రాం సురేష్, గద్దల మహేష్, రాము, పొట్టి, కృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు